అభివృద్ధి పనులపై దృష్టి సారించండి

అధికారులను మందలించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

హస్మత్‌పేటలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. చిత్రంలో కార్పొరేటర్ నర్సింహయాదవ్

బాలానగర్, జూన్ 24 : నిర్లక్ష్యం వీడి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అభివృద్ధిపై దృష్టి సారించాలని వివిధ విభాగాల అధికారులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మందలించారు. సోమవారం ఓల్డ్‌ఓయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి డివిజన్‌లో పరిధిలోని మానససరోవర్ హైట్స్ నాలా పరిశీలన, బోయిన్ చెరువును సందర్శన, చెరువుకట్ట సుందరీకరణ, మందులబస్తీలో అమ్మవారి ఆలయం వార్షికోత్సవంలో వారు పాల్గొన్నారు. అనంతరం డివిజన్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో బస్తీవాసులు, కాలనీవాసుల విజ్ఞప్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను అధికారులు పూర్తి చేయకపోవడం విచారకరం అన్నారు. చేపట్టిన పనులు పూర్తి చేయకుండా అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని పేర్కొన్నారు. హస్మత్‌పేట చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోవడం వలన స్థానిక ప్రజలకు దోమల బెడద అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే చెరువులో గుర్రపు డెక్క తొలగింపును చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. బోయిన్‌చెరువు కట్టను సుందరీకరణ చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. ఎస్సీ బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని ఆయన సూచించారు. అనంతరం కార్పొరేటర్ నర్సింహయాదవ్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్ గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్‌రావు, జల మండలి అధికారి షంషేర్, టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్ సోమేశ్, నీటి పారుదలశాఖ ఏఈ లక్ష్మీనారాయణ, విద్యుత్‌శాఖ అధికారులు, బీఆర్ఎస్ నేతలు నరేందర్ గౌడ్, కర్రె జంగయ్య, మక్కల నర్సింగ్, మన్నే ఉదయ్ యాదవ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, గడ్డం నర్సింగ్‌రావు, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, మల్లేశ్ యాదవ్, చందు యాదవ్, లలిత,, దుర్గ, రోజా, సునంద, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి జడ్సీగా ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, జూన్ 24: శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా ఉపేందర్‌రెడ్డి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. బల్దియాలో శానిటేషన్ విభాగం అదనపు కమిషనర్‌గా పని చేస్తున్న ఆయన ఇక్కడి జడ్సీగా నియామకమయ్యారు. 2019-21 వరకు ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్‌గా ఆయన పని చేశారు. కాగా, ఇప్పటి వరకు ఇక్కడ జడ్సీగా విధులు నిర్వర్తించిన ఐఏఎస్ అధికారి స్నేహ శబరీష్ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కాగా నూతన జడ్సీ ఉపేందర్‌రెడ్డిని ఆయా సర్కిళ్ల డీసీలు, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, శానిటేషన్ సహా ఇతర విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలుసుకుని స్వాగతం పలికారు.

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అపూర్వ్ చౌహాన్

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 24 : కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అపూర్వ్ చౌహాన్ నియమితులయ్యారు. ఇన్నాళ్లు కూకట్‌పల్లి జడ్సీగా పని చేసిన అభిలాష అభినవ్ పదోన్నతిలో భాగంగా నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ కాగా.. ఇన్‌చార్జిగా శేరిలింగంపల్లి జడ్సీ స్నేహ శబరీష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, సోమవారం రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఉన్నతాధికారులకు స్థానం చలనం కలిగించగా, జోగులాంబ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న 2020 బ్యాచ్‌కు చెందిన అపూర్వ్ చౌహాన్‌ను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా నియమించారు.

ప్రజావాణికి పలు సమస్యలపై ఫిర్యాదు

కుత్బుల్లాపూర్, జూన్ 24:ప్రతి సోమవారం మున్సిపల్ సర్కిల్ కార్యాలయాల్లో జరిగే 'ప్రజావాణి' కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో ప్రజల నుంచి పలు సమస్యలతో వెల్లువెత్తింది. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో మొత్తం 7 ఫిర్యాదులు అందగా..గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో 8 ఫిర్యాదులు అందినట్లు డీసీలు నర్సింహ, మల్లారెడ్డి తెలిపారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి

మియాపూర్, జూన్ 24: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో డివిజన్ పనులపై కార్పొరేటర్ రోజాదేవి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో మంజూరై ప్రారంభం కాని పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేయాలని కోరారు. అధికారులు వాహీద్‌అలీ, ఆశ, ప్రియాంక, సుజాత, వినాయకాంత్, దివ్య, గురువారెడ్డి, నరేశ్, భద్రయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణలో మరో పది మంది అరెస్ట్

మియాపూర్, జూన్ 24: శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ ప్రశాంత్‌నగర్‌లోని సర్వే నంబర్ 100, 101 లలోని హెచ్‌ఎండీఏ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించిన వారిలో సోమవారం మరో పది మందిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మియాపూర్ సీఐ దుర్గారామలింగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ ఘటన వెనుక మొత్తం 50మందిని గుర్తించగా..ఆదివారం 21మందిని అరెస్ట్ చేయగా.. సోమవారం మరో పది మందిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. తాజాగా అరెస్టయిన వారిలో రాత్లావత్ మోహన్, మూడావత్ మోహన్ నాయక్, బేగరి దేవమ్మ, చౌహాన్ దినేష్, ఆంగోతు కుర్మా నాయక్, లావుడ్యా కిషన్, ఆయిగరి రవి, మంద నగేశ్, ఆంగోతు ప్రభాకర్, బంకాల మధులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

మాదాపూర్,జూన్ 24:ఓ యువకుడు ఆర్థిక సమస్యలతో దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన ప్రకారం.. పర్వత్‌నగర్‌కు చెందిన ఎం.సాయికిరణ్(23) క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబసభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. సోమవారం కేబుల్ బ్రిడ్జిపై నుంచి దుర్గంచెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఆ వ్యక్తిని చెరువులో నుంచి వెలికితీసి కాపాడారు. అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు.

కాలనీల్లో మెరుగైన రహదారులు : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న విజయనగర్ కాలనీవాసులు

మియాపూర్, జూన్ 24: మెరుగైన ప్రజా రవాణా కోసం బాటలు వేస్తున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఇందుకు ప్రతి కాలనీలో సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న సీసీ రహదారుల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీని కోరారు. ఈ మేరకు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో కోట్లాది నిధులను వెచ్చించి పక్కా రహదారుల నిర్మాణాలను చేపట్టి ప్రజలకు మరింత సౌకర్యం కల్పించామన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ ముందుకు సాగుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, స్వరూప, హన్మంతరావు, మురళీ కృష్ణ, శ్రీనివాస్, రఘుపతిరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, కార్పొరేటర్ ప్రణయ తదితరులు

దుండిగల్, జూన్ 24: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి,7వ డివిజన్‌లోని 191, ఎన్‌టీఆర్‌నగర్‌లో రూ.50లక్షలతో నూతనంగా నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ ప్రణయతో కలిసి డిప్యూటీ మేయర్ ధన్‌రాజ యాదవ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంజునాథ్‌తో పాటు ఎన్‌టీఆర్ నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో తమ సమస్యలను తెలుపుకుంటున్న ఆయా కాలనీలవాసులు

కుత్బుల్లాపూర్, జూన్ 24 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా తన నివాసం వద్ద కలిసి తమ సమస్యలను తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లైన్లో మాట్లాడి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించడంతో పాటు మౌలిక వసతులు సకాలంలో కల్పించాలని సూచించారు.

బోనాల ఉత్సవాల నిధులకు దరఖాస్తులు

బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం విడుదల చేసే నిధుల కోసం ఆయా ఆలయాల ఉత్సవాల కమిటీ నిర్వాహకులు దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కోరారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు లెటర్‌ప్యాడ్, బ్యాంకు అకౌంట్ కాఫీ, కమిటీ సభ్యుల ఆధార్ కార్డు కాపీ, మూడు ఆలయ ఫొటోలతో తన కార్యాలయంలో ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎంఎల్ ఆర్ఐటీని సందర్శించిన ఎంఎస్ఎంఈ ప్రతినిధులు

కళాశాలను సందర్శించిన డానిష్ పేటెంట్ ట్రేడ్ మార్క్ కార్యాలయం, ఎంఎస్ఎంఈ ప్రతినిధులతో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్, జూన్ 24: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిలక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ)కళాశాలను సోమవారం డానిష్ పేటెంట్ అండ్ ట్రేడ్ మార్క్ కార్యాలయం(డీకేపీటీఓ), మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(ఎంఎస్ఎంఈ) ప్రతినిధులు సందర్శించారు.ఈసందర్భంగా ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో 2019లో స్థాపించిన మేధో సంపత్తి ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మర్రిలక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కే.శ్రీనివాసరావు, డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి సందర్శకులకు స్వాగతం పలికారు. కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడంతో పాటు మేధో సంపత్తి హక్కులను పరిరక్షించడంలో మేధో సంపత్తి ఫెసిలిటేషన్ విశేషమైన సేవలందిస్తుందన్నారు. ఎంఎల్ఆర్ఐటీ కళాశాలను సందర్శించిన వారిలో డానిష్ పేటెంట్ అండ్ ట్రేడ్ మార్క్ కార్యాలయం ప్రిన్సిపాల్ సెక్రెటరీలు కిర్‌స్టెన్ క్లైర్‌స్కాట్, టీనా, డెన్మార్క్ రాయభార కార్యాలయం ఐపీఆర్ కౌన్సిలర్ లూయిస్‌బోయిసెన్, ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌లు సతీశ్‌కుమార్, నితీశ్‌కుమార్‌శర్మ ఉన్నారు.

పెద్దచెరువును సందర్శించిన డీసీ

గోపన్‌పల్లితండా పెద్దచెరువును కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి పరిశీలిస్తున్న శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజనీకాంత్ రెడ్డి

శేరిలింగంపల్లి, జూన్ 24: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లితండా పెద్దచెరువును స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజనీకాంత్ రెడ్డి సోమవారం సందర్శించారు. పెద్దచెరువులో కాలుష్యం కారణంగా చేపలు మృత్యువాత పడడంపై పరిస్థితిని సమీక్షించారు. సమస్య పరిష్కారానికి గ్రామం నుంచి చెరువులోకి మురుగునీరు రాకుండా శాశ్వత పరిష్కారం దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామని డీసీ రజనీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంత్‌నాయక్, తిరుపతి, నర్సింగ్ నాయక్, ఆలకుంట్ల శేఖర్, రంగస్వామి, గోపన్‌పల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

మంజీరా డైమండ్‌హైట్స్‌లో...

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి మంజీరా డైమండ్‌హైట్స్ కాలనీలో నెలకొన్న స్థానిక సమస్యలపై కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజనీకాంత్ రెడ్డి సోమవారం పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు సీసీరోడ్ల నిర్మాణం, డ్రైనేజీ సమస్య, వాటర్ పైపులైన్ల నిర్మాణం తదితర సమస్యలపై కాలనీవాసులు డీసీ రజనీకాంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు రేవతి, పద్మ, ఉదయలక్ష్మి, సత్యనారాయణ, బెనర్జీ, రెడ్డి, శ్రవణ్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌పీ బాలసుబ్రహ్మణ్యం సేవలు మరువలేనివి..

సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్

గాన గాంధర్వుడు ఎస్‌పీ బాలసుబ్రహ్మణ్యం సినీ ప్రపంచానికి అందించిన సేవలు మరువలేనివని సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, గాయకులు సాయిచరణ్, హరిణీలు అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీలోని నెక్సెస్ మాల్‌లో ఎస్‌పీ బాలాసుబ్రహ్మణ్యంకు నివాళిలో భాగంగా 106.4ఎఫ్ ఆధ్వర్యంలో బాల గాన గంధర్వులు-సీజన్ 4 ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, గాయకులు సాయిచరణ్, హరిణీలు వ్యవహరించారు. ఈ సంగీత పోటీల్లో 15 ఏండ్ల లోపు బాలబాలికలు పోటీపడగా.. ఫైనల్ పోటీలో ఐదుగురు చిన్నారులు బాలసుబ్రహ్మణ్యం పాడిన పాలను ఆలపించగా.. శ్రోతలను ఆకట్టుకున్నాయి. విశ్వదత్త తుది విజేతగా నిలువగా.. లిఖిల ద్వితీయ స్థానంలో, శ్రీవైష్ణవి తృతీయ స్థానంలో నిలువగా వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌జేలు నాని, రవళి, ప్రతీక, సంగీత ఎఫ్ఎం ప్రతినిధులు షివ్, బద్రీనాథ్, ధీరజ్, కృష్ణ మోహన్, భవానీ తదితరులు ఉన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 24

నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతే జరిమానాలే

మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి, అధికారులు

కుత్బుల్లాపూర్,జూన్ 24:నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై తిరుగుతున్న వాహనాలపై మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. సోమవారం మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి నేతృత్వంలో అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు చౌరస్తాల్లో, ప్రధాన రహదారులపై తనిఖీలు చేపట్టి నంబర్‌ప్లేట్లు లేకుండా తప్పించుకొని తిరుగుతున్న సుమారు 22 వాహనాలను పట్టుకొని అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి, ఎన్.శ్యామ్ బాబు, సిబ్బంది ఉన్నారు.

చింతల్‌లో ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ధర్నా

గాజులరామారం సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదబేగం, పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్, జూన్24 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ పరిధి చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో సర్వే నంబర్ 155లో ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదాబేగంతో పాటు పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్‌సింగ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలంలో 3500 గజాల స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ రూ.26 లక్షల నిధులు మంజూరు చేయించామన్నారు. ప్రస్తుతం 3500 గజాల స్థలంలో 1200 గజాల స్థలాన్ని తక్కువ చేసి మున్సిపల్ అధికారులు కంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖ నుంచి ప్రభుత్వ స్థలానికి ఎలాంటి కొలతలు, గుర్తింపులు కానీ స్కేచ్‌మ్యాప్ లేకుండా 1200 గజాల స్థలాన్ని ఎలా కుదిరించారని డీసీ మల్లారెడ్డిని నిలదీశారు. దీనిపై డీసీ మల్లారెడ్డిని వివరణ కోరగా.. గతంలో పలుమార్లు పైఅధికారుల ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ శాఖల ఆధ్వర్యంలో హద్దులు ఏర్పాటు చేశామన్నారు. ఏడీ సర్వేకు రిపోర్టు చేయగా.. వారి స్పందించలేదని, 1994 మ్యాప్ ఆధారంగా ఈ స్థలంలో దోభీఘాట్ నిర్మాణం మ్యాప్ ఉందని, కేవలం 2964 గజాల స్థలం మాత్రమే తేలిందని తెలిపారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, భగత్‌సింగ్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఎత్తేయాలని హెచ్‌సీయూలో ఆందోళన

కొండాపూర్, జూన్ 24 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో వైస్ చాన్సలర్ నివాసం ముందు ఆందోళన చేసిన విద్యార్థులపై విధించిన సస్పెన్షన్, ఫైన్‌లను వెంటనే ఎత్తివేయాలంటూ సోమవారం హెచ్‌సీయూ ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వర్సిటీ యాజమాన్యం సాంస్కృతిక కార్యక్రమాలను వాయిదా వేయడంతో వర్సిటీ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు అతీక్ అహ్మద్, కృపా, జార్జ్, మోహిత్, సోహెల్ అహ్మద్, అసిక వీఎంలతోపాటు మరికొంత మంది విద్యార్థులు వర్సిటీలోని వీసీ నివాసం ముందు ఆందోళన చేశారు. దీంతో వర్సిటీ అధికారులు అతీక్ అహ్మద్, కృపా, జార్జ్, మోహిత్, సోహెల్ అహ్మద్, అసిక వీఎంలను సస్పెండ్ చేశారు. మరో ఐదుగురు విద్యార్థులకు రూ.10వేల ఫైన్ విధించారు. దీంతో పాటు ఎఫ్ ఐఆర్‌ను నమోదు చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ విద్యార్థులు వర్సిటీలోని రోహిత్ వేముల విగ్రహం వద్ద ఆందోళన చేపట్టి విద్యార్థులపై అక్రమ సస్పెన్షన్, ఫైన్‌లను వెంటనే తొలగించాలంటూ, యాజమాన్యం తమ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

జలమండలి ప్రజావాణిలో పది ఫిర్యాదులు

జగద్గిరిగుట్ట, జూన్24 :ప్రజావాణిలో భాగంగా సోమవారం ఐడీపీఎల్ చౌరస్తాలోని జలమండలి కార్యాలయానికి పది ఫిర్యాదులు అందినట్టు అధికారులు తెలిపారు. కనెక్షన్, అధిక బిల్లులు, డ్రైనేజీ, కొత్త పైపులైన్ ఏర్పాటుకు ప్రజలు వినతి పత్రాలు ఇచ్చారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని జీఎం శ్రీధర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దుండిగల్,జూన్24:నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన 'ప్రజావాణి'లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో కార్మికులు అందాల్సిన రెయిన్‌కోర్టులు, నూనె డబ్బాలు, సబ్బులు, చేతిగ్లౌజ్‌లు, టార్చిలైట్ సామగ్రితో కూడిన కిట్‌ను ఏర్పాటు చేసి తక్షణమే అందజేయాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు ఆశీయాదయ్య పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ విజయం

దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, సారేగూడెంలోని ఆల్కాలిక్ మెటల్స్ పరిశ్రమ యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ ప్యానల్ విజయం సాధించింది. ఐఎన్‌టీయూసీ తరపున అధ్యక్ష పదవికి పోటీ చేసిన, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ రాముగౌడ్ గెలుపొందారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూనశ్రీశైలంగౌడ్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ జడ్పీవైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి యూనియన్ సలహాదారులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తమ గెలుపుకు సహకరించిన ప్రతిఒక్కరికి రాముగౌడ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు పదానందం, మాజీ జడ్పీవైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, డీ.పోచంపల్లి మాజీ సర్పంచ్ యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కార్మిక నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

– దుండిగల్, జూన్ 24

చందానగర్‌లోని జీఎస్ఎం మాల్‌లో శేరిలింగంపల్లి, బీహెచ్ఈఎల్, పటాన్‌చెరు, మియాపూర్‌ల కమ్మ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రామోజీ గ్రూపుల అధినేత దివంగత చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, కమ్మ సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సంఘాల సభ్యులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. – కొండాపూర్, జూన్ 24

నైపుణ్య శిక్షణ కేంద్రానికి గుర్తింపు



హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రిషి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ కేంద్రానికి రీజినల్ సెంటర్‌గా గుర్తింపు లభించింది. ఎడ్యునెట్, టాస్క్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నడుస్తున్న నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా కంప్యూటర్ కోర్సులలో నానాటికీ వస్తున్న అధునాతన సాంకేతికతపై విద్యార్థులను సుక్షితులను చేస్తున్నందుకు గాను ఈ గుర్తింపు లభించింది. కళాశాల కరస్పాండెంట్ రాజశ్రీ సదరు ధ్రువీకరణ పత్రాన్ని అందుకోవడంతోపాటు ఆచార్యులను అభినందించారు. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు కళాశాలలోని నైపుణ్య కేంద్రంలో శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. – మియాపూర్, జూన్ 24

శ్రీరస్తు
శుభమస్తు
అవిఘ్నమస్తు
హరహర శంకర జయ జయ శంకర
శ్రీశ్రీశ్రీ వీరాంజనేయస్వామి మరియు శ్రీ నీలకంఠేశ్వరస్వామి వారి దేవస్థానము
రోడ్ నం.2, కె.పి.హెచ్.బి కాలనీ, హైదరాబాద్
దేవాలయ (38)వ వార్షిక మహోత్సవములు
ప్రారంభము : తేది:25.06.2024 మంగళవారము
ముగింపు : తేది: 27.06.2